నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, శుక్రవారం 28 ఫిబ్రవరి 2025 | YADADRI BHUVANAGIRI

నల్లగొండ ఆర్జాలబావి గోదాములో బ్యాలెట్ బాక్సులను భద్రపరిచేందుకు ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్ఓ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్ చంద్ర పవార్

ఎమ్మెల్సీ పోలింగ్ 93.55%

ప్రశాంతంగా ముగిసిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటింగ్

పట్టణ ప్రాంతాల్లో సాయంత్రం 4గంటల వరకు క్యూలైన్లు

మండల కేంద్రాల్లో అప్పడొకరు ఇప్పడొకరు అన్నట్లుగా రాక

పలుచోట్ల పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఆర్ఓ ఇలా త్రిపాఠి

భారీ బందోబస్తు నడుమ బ్యాలెట్ బాక్స్‌ల తరలింపు

నల్లగొండలోని ఆర్జాలబావి గోదాముల్లో స్ట్రాంగ్‌రూమ్స్

గతం కంటే 2.14శాతం పెరిగిన పోలింగ్.. వచ్చే నెల 3న కౌంటింగ్

నల్లగొండ ప్రతినిధి, ఫిబ్రవరి27(నమస్తే తెలంగాణ) : వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ శాసనమండలి నియోజకవర్గ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 8నుంచి మొదలైన పోలింగ్ సాయంత్రం 4గంటల వరకు కొనసాగింది. నియోజకవర్గ వ్యాప్తంగా 93.55 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి ప్రకటించారు. ఈ ఎన్నికల్లో 19మంది అభ్యర్థులు బరిలో నిలువగా 200 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు ఓటు వేశారు. అందులో 150 పోలింగ్ కేంద్రాలు గ్రామీణ ప్రాంత మండల కేంద్రాల్లోనే ఉండడంతో అక్కడ ఓటింగ్ కోసం ఆడపాదడపా ఓటర్లు వస్తూ కనిపించారు. మున్సిపల్ పట్టణాలతోపాటు 11 జిల్లా కేంద్రాల్లోని పోలింగ్ కేంద్రాల్లో మాత్రమే ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉండడంతో వీటిల్లో ఓటర్లు బారులుదీరారు. కొన్నిచోట్ల పోలింగ్ ముగిసే సమయానికి కూడా ఓటర్లు క్యూలైన్లలో వేచి ఉండి తర్వాత ఓటు వేశారు. కాగా మొత్తం ఓటర్ల సంఖ్య 25,797 కాగా ఇందులో 24,132 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. అత్యధికంగా యాదాద్రి జిల్లాలో 96.54శాతం, తక్కువగా హన్మకొండలో 91.66శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్ ముగిసిన అనంతరం 12 జిల్లాల నుంచి బ్యాలెట్ బాక్స్‌లన్నీ ప్రత్యేక బందోబస్తు నడుమ అర్ధరాత్రి నల్లగొండకు తరలించారు. ఆర్జాలబావిలోని స్టేట్ వేర్ హౌసింగ్ గోదాముల్లోని స్ట్రాంగ్‌రూమ్స్‌లో బ్యాలెట్ బాక్స్‌లను భద్రపరిచారు. వీటి వద్ద ప్రత్యేక భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేశారు. ఈ నెల 3వ తేదీన ఇక్కడే ఓట్ల లెక్కింపు కొనసాగనుంది.

జిల్లాల వారీగా పోలింగ్ శాతం

జిల్లా	మొత్తంఓట్లు	పోలైన ఓట్లు	పోలింగ్‌శాతం
సిద్దిపేట	166	156	93.98
జనగాం	1002	945	94.31
హన్మకొండ	5,215	4,780	91.68
వరంగల్	2,352	2,214	94.13
మహబూబాబాద్	1,663	1,571	94.47
భూపాలపల్లి	329	308	93.62
ములుగు	628	583	92.83
భద్రాద్రికొత్తగూడెం	2,022	1,859	91.94
ఖమ్మం	4,089	3,804	93.03
యాదాద్రి	984	9,50	96.54
సూర్యాపేట	2,664	2,530	94.97
నల్లగొండ	4,683	4,433	94.66
మొత్తం	25,797	24,132	93.55

భూదాన్‌పోచంపల్లి పోలింగ్ కేంద్రంలో ఓటింగ్ సరళిని పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

జిల్లాల వారీగా పోలింగ్ ఇలా....

12 జిల్లాల పరిధిలో నియోజకవర్గం విస్తరించి ఉండగా సిద్దిపేటలో 93.98శాతం, జనగామలో 94.31శాతం, హన్మకొండలో 91.66శాతం, వరంగల్‌లో 94.13శాతం, మహబూబాబాద్‌లో 94.47శాతం, భూపాలపల్లిలో 93.62శాతం, ములుగులో 92.83శాతం, భద్రాద్రికొత్తగూడెంలో 91.94శాతం, ఖమ్మంలో 93.03శాతం, యాదాద్రిలో 96.54శాతం, సూర్యాపేటలో 94.97శాతం, నల్లగొండలో 94.66శాతం పోలింగ్ నమోదైంది. అత్యధికంగా యాదాద్రి జిల్లాలో 984 మంది ఓటర్లు గానూ 950 మంది ఓటు వేయగా 96.54శాతం కావడం విశేషం.

గతం కంటే పెరిగిన పోలింగ్

2019 మార్చిలో జరిగిన ఎన్నికల్లోని పోలింగ్‌తో పోలిస్తే ఈ సారి పోలింగ్ శాతం పెరుగడం విశేషం. గతంలో 20,888 మంది ఓటర్లు ఉండగా అందులో 18,884 మంది ఓట్లేశారు. దీంతో అప్పుడు 90.41శాతంగా తుది పోలింగ్ నమోదైంది. అయితే ఈ సారి గతం కంటే పోలింగ్ శాతం 2.14శాతం పెరిగింది. ఈ సారి ఓటర్ల సంఖ్య కూడా పెరిగినా పోలింగ్ శాతం కూడా పెరగడం గమనార్హం. గతంతో పోలిస్తే ఈ సారి ప్రధాన సంఘాల అభ్యర్థుల సంఖ్య పెరుగడం అందరూ గెలుపు కోసం సర్వశక్తులొడ్డారు. ఈ క్రమంలో ఓటర్లను ఆకర్షించేందుకు డబ్బు, మద్యం, విందు వినోదాల లాంటి ప్రలోభాలు పెద్ద ఎత్తున ప్రయోగించారు. దీంతో ఎక్కువ మంది ఓటర్లను కూడా అభ్యర్థులను కలువడం.. అందుకు అనుగుణంగానే ఓటర్లు కూడా పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి ఓటుహక్కు వినియోగించుకున్నట్లు పరిశీలకులు అంచనా వేస్తున్నారు.

నల్లగొండకు బ్యాలెట్ బాక్స్‌లు

12 జిల్లాల పరిధిలో పోలింగ్ ముగిసిన అనంతరం ఆ బ్యాలెట్ బాక్స్‌లన్నింటినీ నల్లగొండ జిల్లా కేంద్రానికి తరలించారు. పోలింగ్ ముగిసిన వెంటనే పోలింగ్ కేంద్రాల నుంచి బాక్స్‌లను ఆయా జిల్లా కేంద్రాలకు అక్కడి నుంచి ప్రత్యేక బందోబస్తు నడుమ నల్లగొండకు తీసుకువచ్చారు. వీటిని నల్లగొండలోని ఆర్జాలబావి స్టేట్ వేర్ హౌసింగ్ గోదాముల్లో ముందే సిద్ధం చేసిన స్ట్రాంగ్ రూమ్స్‌లో భద్రపరిచారు. ఈ స్ట్రాంగ్‌రూమ్స్‌కు బాక్స్‌లన్నీ చేరాక అభ్యర్థుల లేదా వారి ఏజెంట్ల సమక్షంలో రూమ్స్‌కు సీల్ వేశారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో స్ట్రాంగ్‌రూమ్స్ వద్ద 24/7 నిరంతరం నిఘాను ఏర్పాటు చేశారు. ఈ నెల 3వ తేదీన ఇక్కడే ఓట్ల లెక్కింపు జరుగనుంది. పోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో అధికారులు ఇక కౌంటింగ్ ఏర్పాట్లపై దృష్టి సారించారు.

ఇక కౌంటింగ్‌పై దృష్టి : ఇలా త్రిపాఠి, ఆర్ఓ

వరంగల్ -ఖమ్మం- నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని, ఇక కౌంటింగ్ ఏర్పాట్లపై దృష్టి సారించనున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. గురువారం పోలింగ్ ప్రారంభమైన తర్వాత జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాల, సెయింట్ అల్ఫాన్సస్ పాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఆమె పోలింగ్‌సరళిని పరిశీలించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి వెబ్ కాస్టింగ్ ద్వారా 12 జిల్లాల పోలింగ్ సరళిని పర్యవేక్షించారు. తనతోపాటు, ఆయా జిల్లాల కలెక్టర్లు, ఏఆర్ఓలు, ఇతర బృందాల సమన్వయంతో పోలింగ్ సజావుగా ముగిసిందన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా సాయంత్రం 4 గంటల వరకు 93.55 శాతం ఓట్లు పోలైనట్లు చెప్పారు. ఇక ఓట్ల లెక్కింపునకు సంబంధించి వచ్చే నెల 3వ తేదీన నల్లగొండలోని ఆర్జాలబావిలో ఉన్న గోదాములో ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. సాయంత్రం ఎస్పీ పవార్‌తో కలిసి కలెక్టర్ త్రిపాఠి స్ట్రాంగ్ రూమ్స్‌ను పరిశీలించారు. అక్కడ తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. బ్యాలెట్ బాక్స్‌లను అక్కడే స్ట్రాంగ్‌రూమ్స్‌లో భద్రపరుస్తున్నట్లు, వీటి వద్ద నిరంతర నిఘా ఏర్పాటు చేసినట్లు ఈ సందర్భంగా త్రిపాఠి తెలిపారు.

పోలింగ్ అనంతరం రామన్నపేటలో బ్యాలెట్ బాక్స్‌లను నల్లగొండకు తరలిస్తున్న సిబ్బంది

నల్లగొండలో ఓటర్ స్లిప్పులను చూపిస్తున్న టీచర్లు

93.55శాతం పోలింగ్ నమోదు

వరంగల్-ఖమ్మం- నల్లగొండ టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోలింగ్ ముగిసిన 4గంటల తర్వాత ఇచ్చిన అప్‌డేట్ ప్రకారం మొత్తం 93.55శాతం పోలింగ్ నమోదైంది. ఇందులో ఇంకా తుది పోలింగ్ లెక్కలు వెలువడాల్సి ఉందంటూ... ఇందులో స్వల్ప తేడాలు ఉండవచ్చని గురువారం రాత్రి అధికారులు ప్రకటించారు. పోలింగ్ ఉదయం 8 గంటలకు ప్రారంభం కాగా ప్రతి రెండు గంటలకు ఒకసారి ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పోలింగ్ శాతాన్ని విడుదల చేశారు. తొలి రెండు గంటల్లో అంటే 10 గంటల వరకు 16.78శాతం నమోదైంది. తర్వాత మధ్యాహ్నం 12 గంటల వరకు 48.68శాతం, మధ్యాహ్నం 2 గంటల వరకు 76.33శాతం, సాయంత్రం నాలుగు గంటలకు పోలింగ్ ముగిసే సమయానికి 93.55శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల మధ్య భారీగా పోలింగ్ నమోదైనట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. నియోజకవర్గ పరిధిలో సిద్దిపేట, జనగాం, హన్మకొండ, వరంగల్, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, యాదాద్రిభువనగిరి, సూర్యాపేట, నల్లగొండ జిల్లాలు ఉన్నాయి. వీటి అన్నింటిలోనూ 91శాతానికి పైగానే పోలింగ్ నమోదు కాగా అత్యధిక ఓట్లు ఉన్న హన్మకొండలో 91.66శాతంతో తక్కువ పోలింగ్ జరిగింది.

సజావుగా పోలింగ్

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నియోజకవర్గ వ్యాప్తంగా పూర్తి ప్రశాంతంగా కొనసాగింది. ఎక్కడా చిన్న ఘటన కూడా చోటు చేసుకోలేదు. పోలింగ్ సందర్భంగా ఆయా అభ్యర్థుల తరపున సంఘాల నేతలు, అనుచరులు కేంద్రాల వద్ద సందడి చేసినా సజావుగా పోలింగ్ ముగియడంతో అధికారులు సైతం ఊపిరి పీల్చుకున్నారు. ఉదయం 7గంటల నుంచి పోలింగ్ కేంద్రాల వెలుపల ఆయా సంఘాల నేతలు, కార్యకర్తలు తమ అభ్యర్థికి మద్దతుగా టెంట్లు వేసి కూర్చుకున్నారు. సాయంత్రం వరకు ఇది కొనసాగింది. జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు పోలింగ్ సందర్భంగా పలుచోట్ల కేంద్రాల వద్ద పరిస్థితిని సమీక్షించారు. రిటర్నింగ్ అధికారి, నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి పోలింగ్ కేంద్రాలను సందర్శిస్తూ సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఎస్పీ శరత్ చంద్ర పవార్ కూడా బందోబస్తును పర్యవేక్షించారు.

సంస్థాన్ నారాయణపురంలో ఓటు హక్కును వినియోగించుకున్న ఉపాధ్యాయులు

మూడంచెల భద్రత : శరత్ చంద్రపవార్, ఎస్పీ, నల్లగొండ

ఉపాధ్యాయ ఎన్నికలు కట్టుదిట్టమైన భద్రత నడుమ ప్రశాంతంగా ముగిసినట్లు నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ తెలిపారు. పలు పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తును పర్యవేక్షించారు. సాయంత్రం స్ట్రాంగ్ రూమ్స్ వద్ద కూడా బందోబస్తు చర్యలను పరిశీలించారు. ఆర్జాలబాయి స్టేట్ వేర్ హౌసింగ్ గోదాముల్లోని స్ట్రాంగ్ రూమ్స్ దగ్గర దాదాపు 100 మంది సిబ్బందితో మూడంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. స్థానిక పోలీసులతో పాటు ఆర్మ్‌డ్ రిజర్వ్, టిజీఎస్‌పీ సిబ్బంది స్ట్రాంగ్ రూంల వద్ద 24 గంటల పాటు సాయుధ రక్షణ ఏర్పాటు చేసి, CCTV కెమెరాల ద్వారా పర్యవేక్షణ కొనసాగుతుందని వెల్లడించారు. వీరందరూ ఎన్నికల కౌంటింగ్ పూర్తయ్యే వరకు విధులో ఉంటారని ఎస్పీ పవార్ తెలిపారు.

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వద్ద సహాయక చర్యలు పరిశీలించడానికి వెళ్లిన బీఆర్ఎస్ బృందాన్ని పోలీసులు అడ్డుకోవడంతో అక్కడ మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, చిత్రంలో మాజీ మంత్రులు హరీశ్‌రావు, నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు

కార్మికులను రక్షించకుండా చిల్లర రాజకీయాలు

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వద్ద జోకర్లను తలపిస్తున్న మంత్రులు

- మంత్రి పదవులకే మచ్చ తెచ్చేలా వ్యవహారశైలి
- ప్రధాన ప్రతిపక్షంగా మా పాత్ర పోషిస్తాం
- ఎల్ఎల్‌బీసీ టన్నెల్ ప్రతిపాదనే మోసపూరితం
- దుర్మార్గమైన టెక్నాలజీతో నల్లగొండకు ద్రోహం
- బీఆర్ఎస్ హయాంలో టన్నెల్ పూర్తికి ప్రయత్నించాం
- నల్లగొండలో మీడియాతో మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

నల్లగొండ ప్రతినిధి, ఫిబ్రవరి27(నమస్తే తెలంగాణ) : 'ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో ప్రమాదం జరిగిన నాటి నుంచి అక్కడికి వెళ్తున్న మంత్రుల తీరు జోకర్లను తలపిస్తుంది. మంత్రుల తీరు అక్కడ ఏ రకంగా ఉందో అందరూ గమనిస్తున్నారు. 8మంది కార్మికులు అందులో చిక్కుకుని వాళ్ల కుటుంబాలు తీవ్ర ఆందోళనలో ఉంటే మంత్రుల మాటలు సోయిలేకుండా ఉన్నాయి. ఆ కుటుంబాలకు ఓదార్పునిచ్చేలా కాకుండా మరింత క్షోభకు గురిచేసేలా ఉన్నాయి. అక్కడికి పద్ధతి లేకుండా వెళ్లడం.. సరైన కండిషన్‌లో లేకపోవడం.. వాళ్ల వ్యక్తిగత బలహీనతలను అక్కడ బహిర్గతం చేసుకుంటున్నరు. గోడకు చెవులు పెట్టి వినడం.. సెల్ సిగ్నల్ కలుస్తుందని చెప్పడం.. వాటర్ నీళ్లు కలుస్తున్నాయని చెప్పడం.. ఇంత గలీజుగా ఓ మంత్రి వ్యవహార శైలి ఉంది. మంత్రి పదవికే మచ్చ తెచ్చేలా ప్రవర్తిస్తుండడం చాలా దారుణం' అని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. కేసీఆర్ నాయకత్వంలో ఉన్న తెలంగాణకు ఇవ్వాళ కాంగ్రెస్ నాయకుల చేతిలో ఉన్న తెలంగాణకు ఎంత తేడా ఉందనేది దీన్ని బట్టే అర్థం చేసుకోవచ్చన్నారు. జాతీయంగా అంతర్జాతీయంగా తెలంగాణ పరువు తీసేలా కొందరు మంత్రులు వ్యవహరిస్తున్నారని, ఇటువంటి వారిపై క్యాబినెట్‌లో సమీక్షించుకుని వారిని మంత్రి పదవుల్లో ఉంచాలో వద్దో ప్రభుత్వం తేల్చుకోవాలని హితవు పలికారు. ఎల్ఎల్‌బీసీ సొరంగమార్గం సందర్శనకు వెళ్తున్న సందర్భంగా గురువారం ఆయన నల్లగొండలో మీడియాతో మాట్లాడారు.

టన్నెల్ టెక్నాలజీతో నల్లగొండకు ద్రోహం

బీఆర్ఎస్ హయాంలో 2019 నుంచి ఐదేండ్ల పాటు దీని పనులు ముందుకు కొనసాగించకపోవడానికి శ్రీశైలం నుంచి వచ్చే నీటి ఊటనే ప్రధాన కారణమని, ప్రతి నెలా కోటిన్నరకు పైగా నీటిని తోడడానికే ఖర్చు చేశామని జగదీశ్‌రెడ్డి తెలిపారు. దీని కోసం కరెంటు కోతలు లేకుండా సంబంధిత శాఖ మంత్రిగా తానే స్వయంగా పర్యవేక్షించానని, తాము చేసిన ప్రయత్నాలు ఐదేండ్లల్లో ఏ విధంగానూ ముందుకు సాగలేదని ఆయన స్పష్టం చేశారు. సొరంగ మార్గం తవ్వడానికి వాడుతున్న టెక్నాలజీనే అత్యంత దుర్మార్గమైందని, ఆనాడే ఆ టెక్నాలజీపై అభ్యంతరం వ్యక్తం చేశామని గుర్తు చేశారు. సొరంగమార్గం పేరుతో నల్లగొండకు ద్రోహం చేయడమే తప్ప ఇది పూర్తి చేయడం కోసం పెట్టిన ప్రాజెక్టు కాదని చెప్పామన్నారు. కేవలం నల్లగొండ జిల్లా ప్రజలను మోసం చేయడం కోసమే ఆనాటి జిల్లా కాంగ్రెస్ పెద్దల సహకారంతో సమైక్య పాలకులు చేసిన కుట్రలో భాగమే సంక్లిష్టమైన సొరంగ మార్గమని స్పష్టం చేశారు. ఇవ్వాళ జరుగుతుంది కూడా అదేనంటూ ప్రధాన ప్రతిపక్షంగా దీనిపై ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు.

నిర్మాణాత్మకమైన పాత్ర

ఎస్ఎల్‌బీసీ సొరంగమార్గం దుర్ఘటన దురదుష్టకరమని, జరిగిన ఘటనపై అనుమానులు ఉన్నప్పటికీ ఎనిమిది మంది కార్మికులు చిక్కుకుపోవడం తీవ్ర విచారకరమని జగదీశ్‌రెడ్డి అన్నారు. కార్మికులు ఇతర రాష్ట్రాలకు చెందిన వారైనా తెలంగాణ అభివృద్ధిలో భాగమై పనిచేస్తున్నారని, వారి ప్రాణాలను కూడా చాలా విలువైనవి చెప్పారు. ఇదే విషయమై గత వారం రోజులుగా ప్రధాన ప్రతిపక్షంగా అక్కడికి వెళ్తే సహాయక చర్యలకు ఆటంకం కలిగిస్తున్నారన్న విమర్శలు వచ్చే అవకాశం ఉండడంతో తాము దూరంగా ఉన్నట్లు చెప్పారు. కానీ ప్రభుత్వం, మంత్రులు వ్యవహరిస్తున్న తీరు ఆందోళనకు గురిచేస్తుందని, ఇలాంటి సమయంలో ప్రధాన ప్రతిపక్షంగా తమ బాధ్యతను నిర్వర్తించేందుకే టన్నెల్ సందర్శనకు వెళ్తున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు జరుగుతున్న సహాయ చర్యలను పరిశీలిస్తూ.. ప్రధాన ప్రతిపక్షంగా నిర్మాణాత్మక సూచనలు ప్రభుత్వానికి చేయడానికే వెళ్తున్నట్లు వివరించారు. తమ సందర్శనతో రెస్క్యూ ఆపరేషన్‌కు ఎలాంటి ఆటంకం కలుగదని స్పష్టం చేశారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యేలు చిరుమర్తి లింగయ్య, కంచర్ల భూపాల్‌రెడ్డి, బొల్లం మల్లయ్యయాదవ్, నాయకులు రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, బోనగిరి దేవేందర్, సూదిని నరేందర్‌రెడ్డి, మారగోని గణేశ్, రావుల శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వద్దకు వెళ్తూ నల్లగొండలో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, చిత్రంలో మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, బొల్లం మల్లయ్యయాదవ్, తదితరులు

యూరియా కోత..రైతుకు వాత

కృత్రిమ కొరతతో బ్లాక్ మార్కెట్‌లో అమ్మకం

- పీఏసీఎస్ చైర్మన్లు, ఏఆర్ఎస్‌కే, ఎఫ్‌పీఓలతో అక్రమాలు
- పేరుకు అధికారిక బిల్లులు.. సరఫరా ప్రైవేట్ డీలర్లకు..
- ఇతర ఉత్పత్తులకు లింక్ పెట్టి అధిక ధరకు విక్రయిస్తున్న డీలర్లు
- ఒక్కో బస్తా రూ.266 అయితే.. రూ.315 నుంచి రూ.330 విక్రయం
- వచ్చిన దాంట్లో మార్క్‌ఫెడ్, వ్యవసాయ అధికారుల చేతివాటం!

నల్లగొండ, ఫిబ్రవరి 27: జిల్లాలో యూరియా కొరత వేధిస్తున్న నేపథ్యంలో రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. మార్క్‌ఫెడ్ అధికార యంత్రాంగం ప్రధానంగా పీఏసీఎస్ చైర్మన్లతో ఏఆర్ఎస్‌కే, ఎఫ్‌పీఓలతో కుమ్మక్కై ప్రైవేటు ఫర్టిలైజర్లకు బ్లాక్‌లో విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో సన్న, చిన్న కారు రైతులు ఎమ్మార్పీ ధర కంటే ఎక్కువ పెట్టి కొనుగోలు చేయాల్సి వస్తున్నది. బిల్లులు మాత్రం ఏజెన్సీల పేర్లతోనే చేస్తూ వారికి కొంత వాటా ఇచ్చి మిగిలిన వాటా మార్క్‌ఫెడ్ యంత్రాంగం నొక్కేస్తుందట. ఒక్కో లారీకి రూ.10వేల నుంచి రూ.20వేల వరకు అధికారులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇందులో ఇండెంట్ పెట్టే వ్యవసాయ అధికారులతో పాటు సంబంధిత సెక్షన్ అధికారి, ఏడీఏలకు సైతం వాటాలు అందుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. ఈ యాసంగి సీజన్‌లో వాతావరణ పరిస్థితుల కారణంగా అధికంగా యూరియా వాడాలని అధికారులే ప్రకటించిన నేపథ్యంలో రైతులు ఒక్కో ఎకరానికి రెండు బస్తాలకు బదులు నాలుగైదు బస్తాలు వేయడంతో డిమాండ్ పెరిగింది. డిమాండ్‌కు అనుగుణంగా యూరియా రాకపోవడంతో క్షేత్రస్థాయిలో, మార్క్‌ఫెడ్‌లో నిల్వలు నిండుకున్నాయి.

పెరిగిన వాడకం.. తగ్గిన సరఫరా..

జిల్లాలో వాతావరణ పరిస్థితుల కారణంగా యూరియా వాడకం పెరుగడం.. అవసరానికి తగిన యూరియా రాకపోవడం వల్ల ఈ కొరత ఏర్పడి బ్లాక్‌కు దారి తీసింది. ఈ సీజన్‌లో 5.10లక్షల ఎకరాల్లో వరి, 46వేల ఎకరాల్లో వేరుశనగ, కందులు, మిర్చితోపాటు 45వేల ఎకరాల్లో ఆయిల్ పామ్, బత్తాయి, నిమ్మ తోటలు సాగవుతున్నాయి. సుమారు ఆరు లక్షల ఎకరాలకు గానూ ఎకరాకు రెండు బస్తాలు(45 కేజీలు)చొప్పున సుమారు 70వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా ఇప్పటి వరకు 80వేల మెట్రిక్ టన్నులు వచ్చింది. ఈ సారి వాతావరణ పరిస్థితుల కారణంగా వరి తల్లి వేరు త్వరగా ఈనటంతో పిల్ల వేరు ఈనటానికి మరో బస్తా లేదా రెండు బస్తాల యూరియా అధికంగా వేయాల్సి వచ్చింది. దాంతో ఆయకట్టు ఏరియాలో ఎకరాకు 4 నుంచి 5 బస్తాలు, నాన్ ఆయకట్టులో ఎకరాకు 3నుంచి 4 బస్తాలు వేయడంతో 1.50లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కావాల్సి వచ్చింది. ఇప్పటి వరకు 80వేల మెట్రిక్ టన్నులు మాత్రమే కేంద్రం నుంచి రాగా దీన్ని బ్లాక్ చేసి అదనంగా డబ్బులు చెల్లించిన రైతులకు ఎక్కువ ధరలకు అమ్ముతున్నారు. దీన్ని మార్క్‌ఫెడ్ యంత్రాంగంతోపాటు వ్యవసాయ శాఖ క్యాష్ చేసుకుంటున్నదనే ఆరోపణలు వస్తున్నాయి.

యూరియా కావాలంటే మరొకటి కొనాల్సిందే..

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే పాక్షిక సమస్య ఏర్పడ్డ యూరియా కొరత రెండో ఏడాది నాటికి జఠిలమైంది. గడిచిన పదేండ్లలో అవలీలగా మార్కెట్లో లభించిన ఈ ఎరువులు ప్రస్తుతం బ్లాక్ దిశగా కొనుగోల్లు జరుగుతున్నాయి. పట్టణ ప్రాంతాల్లో ఏదో ఒక ఇతర ఎరువు(ప్రధానంగా పొటాష్) కొనుగోలు చేస్తేనే యూరియా ఇస్తున్నారు. ఇక గ్రామీణ ప్రాంతాల్లో 45కేజీల యూరియా బస్తా రూ.330కి పైనే విక్రయిస్తున్నారు. జిల్లాలో 40 ఎన్డీసీఎంఎస్, 10ఎఫ్‌పీఓ, 70ఏఆర్ఎస్‌కే, 31పీఏసీఎస్‌లు ఈ వ్యాపారం చేస్తూ బాగానే వెనకేస్తున్నట్లు తెలుస్తుంది.

ఎమ్మార్పీకి మించి వసూలు..

కేంద్ర ప్రభుత్వం ప్రతి సీజన్‌లో పలు కంపెనీలకు చెందిన యూరియాలో 60శాతం మార్క్‌ఫెడ్‌కు, 40శాతం ప్రైవేటు హోల్ సేలర్స్ ద్వారా సరఫరా చేస్తుంది. యూరియా ఎమ్మార్పీ రూ.266(45 కేజీల బ్యాగ్) ఉండగా పీఏసీఎస్‌లకు అదే ధరకు ఇస్తున్న మార్క్‌ఫెడ్, ఆగ్రోరైతు సేవా కేంద్రం(ఏఆర్ఎస్‌కే), రైతు ఉత్పత్తి కేంద్రాలు(ఎఫ్‌పీఓ), ఎన్డీసీఎంఎస్‌లకు ఎమ్మార్పీ రూ.266తోపాటు ట్రాన్స్‌పోర్ట్ చార్జీలతో కలిపి(రూ.20) అందజేస్తారు. ఇక ప్రైవేటు హోల్‌సేలర్స్‌కు సైతం అంతే స్థాయిలో చెల్లించాల్సి వచ్చినప్పటి ఎమ్మార్పీకీ మాత్రమే విక్రయించాలని లేదంటే వద్దని ప్రభుత్వ ఆదేశాలు. పీఏసీఎస్‌లకు బస్తా రూ.266మాత్రమే పడటంతో అధికంగా వారి పేరు మీద ఇండెంట్ పెట్టి ఇతర ప్రైవేటు డీలర్లకు ఇవ్వడం లేదా నేరుగా పెద్ద రైతులకే బస్తాకు రూ.25 నుంచి 35 తీసుకొని విక్రయించడం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇక కొందరు ఎఫ్‌పీఓలు, ఏఆర్ఎస్‌కేలు సైతం ఇదే స్థాయిలో అధికార యంత్రాంగానికి చేయూతనిస్తున్నారు. దాంతో లారీకి రూ.10వేల నుంచి రూ. 20 వేల వరకు అదనంగా మార్క్‌ఫెడ్ యంత్రాంగం వసూలు చేసి తలా కొంత పంచుకుంటున్నారట. వీరి అక్రమాలకు అగ్రికల్చర్ ఏఓలు, సెక్షన్ అధికారులు మద్దతు ఇస్తున్నట్లు సమాచారం.

ఎమ్మార్పీకి మించి విక్రయిస్తే చర్యలు తప్పవు

జిల్లాలో ఈ సారి వాతావరణ పరిస్థితుల కారణంగా పంటల ఎదుగుదలలో కొంత తేడా వచ్చి యూరియా వాడకం పెరిగింది. ఈ సీజన్‌లో 70వేల మెట్రిక్ టన్నులకుగానూ 80వేలు రాగా ఇంకా మార్కెట్లో 4,500 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉంది. రైతులు ఎక్కడ కొనుగోలు చేసినప్పటికీ బస్తాకు రూ.266కు మించి ఇవ్వవద్దు. ఎవరైనా అంతకు మించి తీసుకుంటే ఫిర్యాదు చేస్తే వారిపై చర్యలు తీసుకుంటాం.

-పాల్వాయి శ్రవణ్ కుమార్,
జిల్లా వ్యవసాయ అధికారి, నల్లగొండ